క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి రూ.1.10 లక్షల విరాళం



చందక లక్ష్మి దంపతులకు బాండ్ అందజేస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం ఆనందపురం గ్రామ సర్పంచ్ చందక లక్ష్మి, సూరిబాబు దంపతులు రూ.1.10 లక్షల విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ బాండ్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి సత్తిబాబు పాల్గొన్నారు.

సత్రం స్థలాల వేలం నేడు

భీమునిపట్నం: భీమిలి పరిధి కుమ్మరిపాలెం సమీపంలోని రమణముత్యాలమ్మ ఆలయం పక్కన సర్వే నంబర్ 22లోని దేవదాయ శాఖకు చెందిన లంగరుఖానా సత్రం స్థలాలు గురువారం వేలం వేయనున్నట్టు సత్రం కార్య నిర్వాహక అధికారి బండారు ప్రసాద్ బుధవారం తెలిపారు. ఒకే దగ్గర పక్కపక్కనే 45 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న నాలుగు ఖాళీ స్థలాలకు మూడు సంవత్సరాలకు లీజుకు ఇవ్వడానికి వేలం నిర్వహించనున్నామని తెలిపారు. ఆసక్తి గల వారు ముందుగా రూ.25 వేలు దరావతు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. వేలంలో స్థలాలు పొందినప్పటికీ శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదని వెల్లడించారు.

గోతులతో ప్రయాణికులకు అవస్థలు



జ్యూట్ మిల్లు సమీపంలో రోడ్డుపై గోతులు

పద్మనాభం: మండలంలోని విజయానంద పురం జంక్షన్‌కు సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా శిథిలమైంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు అటు విజయనగరం, ఇటు సింహాచలం వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. విజయానంద పురం జంక్షన్‌కు సమీపంలో రోడ్డు అధ్వానంగా మారడంతో ద్విచక్ర వాహనచోదకులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి ఈ గోతులను పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

శాకంబరి అలంకరణలో సుత్తమ్మతల్లి



కూరగాయలు, ఆకుకూరల అలంకరణలో చిప్పాడ సుత్తమ్మతల్లి

తగరపువలస: ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా భీమిలి మండలం చిప్పాడ గ్రామ దేవత సుత్తమ్మతల్లిని ఆలయ కమిటీ, భవానీ పీఠం ఆధ్వర్యంలో శాకంబరి దేవిగా బుధవారం అలంకరించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

పేదింటి విద్యా కుసుమాలు

పేదింటి విద్యా కుసుమాలు విరబూశాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కాస్త తోడ్పాటు అందిస్తే ఎవరికీ తీసిపోమని నిరూపించారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోని ప్రభుత్వం అందించిన సహకారానికి తోడు చక్కని ప్రణాళికతో ఇష్టపడి చదివితే ఎంతటి విజయాలనైనా సొంతం చేసుకోవచ్చని చాటిచెప్పారు. రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీలకు భీమిలి నియోజకవర్గం నుంచి 28 మంది విద్యార్థులు ఎంపికై శెభాష్ అనిపించుకున్నారు. వారంతా చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటామని అంటున్నారు.



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చంద్రంపాలెం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డుపై బోధిస్తున్న ఉపాధ్యాయురాలు



గత ప్రభుత్వం చంద్రంపాలెం హైస్కూల్‌లో ఆధునికీకరించిన తరగతి గదిలో విద్యార్థులు

- ట్రిపుల్ ఐటీలకు 28 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఎంపిక
- సీఎం వైఎస్ జగన్ పాలనలో విద్యా రంగానికి ప్రోత్సాహంతో అద్భుత ఫలితాలు

తగరపువలస/మధురవాడ/పద్మనాభం: దేశ భవిష్యత్‌కు బాటలు వేసే ఇంజినీరింగ్ విద్యను ట్రిపుల్ ఐటీల ద్వారా పేద విద్యార్థులకు చేరువ చేసిన ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరొక అడుగు ముందుకేసి అట్టడుగు వర్గాల పిల్లలకూ నాణ్యమైన విద్య అందించేందుకు 'నాడు – నేడు' ద్వారా సర్కారు బడులకు కార్పొరేట్ వసతులు, విద్యార్థులకు పౌష్టికాహారం, విద్యా కానుకల పేరుతో ఉచితంగా పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు, డిక్షనరీలు అందించారు. పాఠశాలలకు పంపించే తల్లుల ఖాతాలో ఏడాదికి రూ.15 వేలు చొప్పున అమ్మఒడి పేరుతో ప్రోత్సాహకాలు అందించారు. విద్యాభివృద్ధికి తండ్రీకొడుకులైన ఈ ఇద్దరు ముఖ్యమంత్రులు చేసిన కృషి ఫలితంగా గ్రామీణ విద్యార్థులకు కలలోనైనా సాధ్యం కాని విద్యా ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 92.99 శాతం, ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన వారు 7.01 శాతం మంది సీట్లు సాధించారు.

- జీవీఎంసీ భీమిలి జోన్ చిట్టివలస, తగరపువలస గ్రామాలకు చెందిన ఇద్దరు పేదింటి బాలికలకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించాయి. చిట్టివలస శ్రీరామకృష్ణ విద్యాలయానికి చెందిన షేక్ రజియా బేగానికి పదో తరగతిలో 593 మార్కులు, ఇప్పాక త్రిసూనకు 588 మార్కులు వచ్చాయి. ఇద్దరు విద్యార్థినులను కరస్పాండెంట్లు మానాపురం వెంకట శివసాయికుమార్, శేఖరమహంతి ప్రసాదరావు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

ఎంపికైన విద్యార్థుల వివరాలు ఇవీ..

మండలం	బాలికలు	బాలురు
భీమిలి	16	06
పద్మనాభం	01	--
ఆనందపురం	01	01
చంద్రంపాలెం	--	03



షేక్ రజియా బేగం



ఇప్పాక త్రిసూన

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా



చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో చదివిన నాకు 10వ తరగతిలో 583 మార్కులు వచ్చాయి. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. నాన్న తిరుపతి సాహు బేకరీలో పనిస్తుంటారు. అమ్మ లక్ష్మి గృహిణి. సోదరి 7వ తరగతి చదువుతోంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా స్థిరపడి దేశసేవ చేస్తాను.

– ప్రేమ్‌కుమార్ సాహు, కొండపేట

తండ్రి కష్టం మరవలేనిది



నాన్న శ్రీనివాసరావు సోడాల వ్యాపారం చేసి నన్ను, చెల్లిని చిట్టివలస హైస్కూల్‌లో చదివించారు. నాకు 10వ తరగతిలో 583 మార్కులు వచ్చాయి. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. నాన్న కష్టాన్ని గుర్తు చేసుకుంటూ భవిష్యత్‌లో ఉన్నతంగా స్థిరపడాలి అనుకుంటున్నా.

– గిడుతూరి భవానీ ప్రసాద్, కొత్తపేట

సివిల్స్ రాసి సేవారంగంలోకి..



నాన్న పోలినాయుడు ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. నాకు పదో తరగతిలో 572 మార్కులు వచ్చాయి. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత సివిల్స్ రాసి సేవా రంగంలోకి ప్రవేశించాలనుకుంటున్నాను.

– గంటా పవన్‌కుమార్, చిప్పాడ

ఉన్నతంగా స్థిరపడతాను



నేను మజ్జివలస జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు మీడియంలో చదువుకుని పదో తరగతిలో మండలంలో అత్యధికంగా 570 మార్కులు సాధించాను. మేము ముగ్గురం అక్క చెల్లెళ్లం. నాన్న బాలాజీ వ్యవసాయం చేస్తారు. దేశానికి దోహదపడే రంగంలో స్థిరపడాలని ఉంది.

– రౌతు ప్రమీల, సామియ్యవలస

సేవారంగం వైపు వెళ్తాను



నాన్న గౌరీశంకర్ క్యాబ్ డ్రైవర్. నాకు 10వ తరగతిలో 569 మార్కులు వచ్చాయి. భీమిలి పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈలో సీటు వచ్చింది. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో కూడా సీటు వచ్చింది. పాలిటెక్నిక్ సీటు వదిలేస్తా. చక్కగా చదువుకుని సేవారంగం వైపు వెళ్తాను.

– వేముల జ్ఞానలక్ష్మి, అమనాం

ప్రజాసేవ చేస్తా...



నాకు 10వ తరగతిలో 568 మార్కులు రావడంతో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. నాన్న రాము విద్యుత్ బిల్లుల రీడింగ్ తీస్తుంటారు. చెల్లి భార్గవి కూడా జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. ఇంజినీరింగ్ తర్వాత ప్రజాసేవ రంగంలోకి ప్రవేశిస్తా.

– కొయ్య జాహ్నవి, అమనాం

కంప్యూటర్ ఇంజినీర్ అవుతాను



నాన్న అప్పారావు ప్రైవేట్ పనులు చేస్తారు. అమ్మ కుమారి గృహిణి. చెల్లి సౌమ్య ఇప్పుడు 10వ తరగతికి వచ్చింది. నాకు 10వ తరగతిలో 563 మార్కులు రావడంతో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. నేను కంప్యూటర్ ఇంజినీరుగా స్థిరపడతాను.

–పచ్చిపాల అనిల్‌కుమార్, చిట్టివలస

ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా



నాకు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కల. నాన్న రమణ మాజీ సైనికుడు. చెల్లెలు లిఖిత‌ను, నన్ను జెడ్పీ హైస్కూల్‌లో చదవిస్తున్నా రు. నాకు 10వ తరగతిలో 511 మార్కులు వచ్చాయి. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. చక్కగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకుంటున్నా.

– బూసర ప్రణవి, సంతపేట

మంచి ఇంజినీర్ అవుతా..



చంద్రంపాలెం హైస్కూల్‌లో చదివిన నాకు 10వ తరగతిలో 580 మార్కులు వచ్చాయి. నాన్న సత్యనారాయణ, అమ్మ రాజేశ్వరి బతుకుతెరువు కోసం స్వస్థలం పార్వతీపురం జిల్లాలోని పరశురామపురం నుంచి కొమ్మాది వచ్చేశారు. అమ్మానాన్న కష్టం గుర్తు చేసుకుంటూ చక్కగా చదివి మంచి ఇంజినీర్‌గా స్థిరపడతాను.

– మోసూరి తరుణ్, కొమ్మాది

మెకానికల్ ఇంజినీర్ అవుతా..



నాన్న జగన్నాథం చిన్న దుస్తుల వ్యాపారి. అమ్మ నాగమణి గృహిణి. బాగా చదువు చెబుతారని నన్ను చంద్రంపాలెం హైస్కూల్‌లో చదివించారు. 10వ తరగతిలో 576 మార్కులు రావడంతో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. అమ్మ,నాన్నతోపాటు నాకు చాలా ఆనందంగా ఉంది. చక్కగా చదువుకుని మెకానికల్ ఇంజినీర్ అవుతాను.

–ఐకా అచ్యుతరావు, ధర్మపురి కాలనీ

అమ్మానాన్న కలలు నిజం చేస్తా



మా నాన్న చిన గంగరాజు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. అమ్మ రమణమ్మ. బతుకుతెరువు కోసం అమ్మానాన్న దేవరాపల్లి మండలం బోయిలి కింతాడు నుంచి ధర్మపురి కాలనీ వచ్చి స్థిరపడ్డారు. అక్క కోసం, నా కోసం అమ్మ నాన్న చాలా కష్టపడ్డారు. 10వ తరగతిలో 572 మార్కులు రావడంతో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. చాలా ఆనందంగా ఉంది. బాగా చదివి అమ్మ నాన్న కష్టాలు తీరుస్తాను.

– దాసరి యశ్వంత్, ధర్మపురి కాలనీ

చాలా ఆనందంగా ఉంది



తాను ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం ఆనందంగా ఉంది. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను. ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన నాకు పదో తరగతిలో 569 మార్కులు వచ్చాయి. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. తండ్రి మిరపకాయల వ్యాపారం చేస్తూ తనను, చెల్లిని చదివిస్తున్నారు.

– మరగడ ఇందు, ఆర్‌వీపురం

నిర్వహణ పనులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తగరపువలస: చిట్టివలస రూరల్, అర్బన్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఫీడర్ల నిర్వహణ, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. తాటితూరు పంచాయతీ, చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల, వాటర్ పంపింగ్ ఏరియా, కృష్ణంరాజుపేట, నారాయణరాజుపేట, లక్ష్మీపురం, మజ్జివలస, తగరపువలస మెయిన్ రోడ్డు, చిట్టివలస, కొత్తపేట, సంతపేట, కొండపేట, బంగ్లామెట్ట, గణేష్ థియేటర్ రోడ్డు, ఆదర్శనగర్, సప్తగిరి లే అవుట్, చిట్టివలస జ్యూట్ మిల్లు క్వార్టర్స్ లైన్లు, రామన్నపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు.

తగరపువలస: ఆనందపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పెద్దిపాలెం, పల్లిపేట, మచ్చవానిపాలెం, పొడుగుపాలెం, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం, బోని రోడ్డు, కుసులవాడ, బీపీ కళ్లాలు, గండిగుండం, మామిడిలోవ, రామవరం, భీమన్నదొరపాలెం, ఆనందపురం, వేములవలస గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అధికారులు తెలిపారు.

మధురవాడ: మధురవాడ 33/11 కేవీ సబ్ స్టేషన్ శివశక్తినగర్ ఫీడర్, కొమ్మాది సబ్ స్టేషన్ పరిధి బక్కన్నపాలెం ఇండోర్ సబ్ స్టేషన్‌లోని 11కేవీ శంభువానిపాలెం ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి, ఏఈ డి.నరేష్ చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు శివశక్తినగర్ రోడ్డు, సద్గురు సాయినాథ కాలనీ, గణేష్‌నగర్, శ్రీలక్ష్మీనగర్, అయ్యప్పనగర్, వైఎస్సార్ కాలనీ, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ, టైలర్స్‌కాలనీ, బక్కన్నపాలెం, ఎన్‌టీఆర్ కాలనీ, లచ్చిరాజు లే అవుట్, రైల్వే లే అవుట్, సీఆర్‌పీఎఫ్ పోలీసు బెటాలియన్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

పీఎం పాలెం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ పీఎం పాలెం ఫీడర్ ఏరియాలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గాయత్రినగర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, విజేత సూపర్ మార్కెట్ ఏరియా, రెండో బస్టాప్ ఏరియా, ఏపీహెచ్‌బీ కాలనీ, కారుషెడ్ కూడలి, సాంకేతిక కళాశాల, పోస్టాఫీస్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

శాకంబరి, గురు పౌర్ణమి ఉత్సవాలకు ఏర్పాట్లు



వివరాలు వెల్లడిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మధురవాడ: చంద్రంపాలెం దుర్గాలమ్మ గుడిలోని షిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 19న శాకంబరి ఉత్సవాలు, 21న గురు పౌర్ణమి నిర్వహించనున్నట్లు శ్రీ దుర్గాలమ్మ సంక్షేమ సేవా సంఘం సభ్యులు తెలిపారు. బుధవారం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆలయ ధర్మకర్త, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు వివరాలు వెల్లడించారు. ఎస్ఎన్ మూర్తి, పిళ్లా మోహన్ శివకృష్ణ, పిళ్లా వెంకటరమణ, గూడేల రాజు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, జగ్గుపిల్లి అప్పారావు, పిళ్లా అప్పన్న, పి.రాంబాబు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని కార్మికుల ఆందోళన



మధురవాడలో ఆందోళన చేస్తున్న కార్మికులు

మధురవాడ: క్లాప్ వాహనాల లోడింగ్ కార్మికులకు బకాయిపడిన 6 నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు డిమాండ్ చేశారు. జీవీఎంసీలో క్లాప్ వాహనాలకు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే కార్మికులకు జీతాలు ఇవ్వకుండా పని చేయించుకోవడం అన్యాయమన్నారు. బుధవారం మధురవాడ జోన్ – 2 పరిధిలోని 5, 6, 7, 8 వార్డులకు చెందిన కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. మధురవాడ కృష్ణానగర్‌లో గల ద్రోణంరాజు కల్యాణ మండపం వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ఒప్పంద కార్మికులకు నెలకు రూ.13,500 ఇస్తామని చెప్పినా 6 నెలలుగా చెల్లించకుండా చాకిరీ చేయించుకుంటున్నారన్నారు. జీతాలు అందక కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఆకలితో అలమటిస్తున్నారన్నారు. కార్మికులకు కనీసం హ్యాండ్ గ్లౌజెస్ కూడా ఇవ్వకపోవడంతో పురుగులు పట్టిన చెత్తను చేతులతోనే ఎత్తుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోడర్స్ గ్లౌజ్‌లు, మాస్కులు, హ్యాండ్ వాష్ లిక్విడ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఎంహెచ్‌వో కిషోర్‌ని కలిసి సమస్యలు వివరించారు. వారం రోజుల్లో జీతాలు విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, టి.వెంకటరమణ, కె.లక్ష్మి, వై.రమణ, లక్ష్మినరసింహ, డి.రాము, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి



రవితేజ (ఫైల్)

భీమునిపట్నం: ఫిట్స్‌తో అనారోగ్యానికి గురైన యువకుడు బుధవారం చనిపోయాడు. స్థానిక కృష్ణా కాలనీకి చెందిన బర్రి రవితేజ (29) కొంత కాలంగా బీచ్‌రోడ్డులోని ఒక ప్రైవేటు రిసార్ట్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి 15 రోజుల క్రితం ఫిట్స్ రావడంతో చికిత్స తీసుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం అతను పని చేస్తున్న రిసార్ట్‌లోని బాత్రూమ్‌లో అపస్మారక స్థితిలో పడి వుండడంతో సిబ్బంది గుర్తించి ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. విషయాన్ని తండ్రి బర్రి అప్పారావుకు తెలియజేయగా అతను ఆస్పత్రికి వెళ్లేసరికి రవితేజ చనిపోయాడని వైద్యులు తెలిపారు. తమ కుమారుడు అనారోగ్యంతో చనిపోయినట్టు అప్పారావు తెలపడంతో ఆ మేరకు ఎస్ఐ పైడిరాజు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కొండపేట కాలనీలో మంగళవారం రాత్రి మధుమిత ఘోష్ అనే వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భీమిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌కు చెందిన మధుమితకు అదే ప్రాంతానికి చెందిన టింకూ కుమార్ ఘోష్ అలియాస్ రాజేష్‌తో 2019లో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. వీరు 9 మాసాల క్రితం తగరపువలస వచ్చారు. టింకూ కుమార్ స్థానిక దుకాణంలో పని చేస్తున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా మాటలు లేవు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భార్య, కుమార్తె ఇంట్లో నిద్రించగా టింకూ కుమార్ హాలులో టీవీ చూస్తూ నిద్రపోయాడు. బుధవారం ఉదయం టింకూ కుమార్ లోపలికి వెళ్లి చూడగా భార్య ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే భీమిలి పోలీసులకు సమాచారం అందించారు. మధురవాడ జోన్ ఏసీపీ సునీల్, భీమిలి సీఐ డి.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ గంటా హరీష్ సంఘటన స్థలానికి చేరుకుని మధుమిత మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు



అలంకరణలో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి



లక్ష తులసి పూజలో వేంకటేశ్వర స్వామి

కొమ్మాది: స్థానిక శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా శ్రీలక్ష్మీనారయణులకు విశేషంగా సుప్రభాత సేవ, తోమాల సేవ నిర్వహించారు. అనంతరం తులసి మాలలతో అలంకరించి పూజలు నిర్వహించినట్లు అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు.

శ్రీవారికి ఘనంగా లక్ష తులసి పూజ

భీమునిపట్నం: కీతిన్‌పేటలోని ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని లక్ష తులసి పూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, ఉసిరికల తాతాజీ, అర్చకులు పురాణం శేషాచార్యులు పాల్గొన్నారు.

మధురవాడ: జీవీఎంసీ ఆఫీసు సమీపంలోని శ్రీ సిద్ధేశ్వర స్వామి పీఠంలో ప్రధాన అర్చకులు దూసి రామలింగ స్వామి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి మారేడు దళాలు, జిల్లేడు పుష్పాలు సమర్పించారు. ధర్మకర్త నరసింహమూర్తి, సతీష్, నాగోతి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో బుధవారం అభిషేకాలు చేశారు. భక్తులు కుంతీ మాధవ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

ఏయూ వీసీగా దళితుడికి అవకాశమివ్వాలి



మాట్లాడుతున్న పోరాట సమితి నాయకులు

సీతమ్మధార: ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్(వీసీ)గా దళిత వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశమివ్వాలని దళిత హక్కుల పోరాట సమితి, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ డిమాండ్ చేసింది. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ ఏయూ వీసీ రాజీనామాను గవర్నర్ ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు కలిగిన ఎందరో ప్రతిభావంతులు, శాస్త్రవేత్తలను తీర్చిదిద్దిన ఘనత ఆంధ్ర యూనివర్సిటీకి ఉందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ లాంటి గొప్ప వ్యక్తులను ఏయూ తయారు చేసిందని గుర్తు చేశారు. యూనివర్సిటీలో సెర్చ్ కమిటీ వేయాలన్నారు. 25 ఏళ్లుగా ఓసీ, బీసీలకు చెందిన వారే వీసీలుగా ఉన్నారని, ఈ సారి దళితులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, కార్యదర్శి జి.రాంబాబు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో విష్ణు సహస్రనామ పారాయణ

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని వంద మంది శ్రీవారి భక్తులతో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ముందుగా వేకువజామున శ్రీవారి సుప్రభాతసేవ, తోమాల సేవ నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

నెల రోజులుగా అంధకారం

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ 6వ వార్డు పుచ్చలపల్లి సుందరయ్య పార్కు వద్ద ధర్మపురి కాలనీలో నెల రోజులుగా సుమారు పది వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఇప్పటికే జోన్ – 2 కార్యాలయంలోపాటు స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదని ఆరోపించారు. ప్రస్తుతం కాలనీలో 103 బి1, 103 బి2, 103 బి3, 103 బి4 తదితర స్తంభాల వద్ద దీపాలు వెలగక విష పురుగుల సంచారం, చిల్లర దొంగతనాలు ఎక్కువై పోయాయని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ వీధి దీపాలు వెలిగేలా మధురవాడ జోనల్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని స్థానికుడు డాక్టర్ పి.ఎస్.రెడ్డి, తదితరులు కోరుతున్నారు.

ఘనంగా మారు రథోత్సవం



శేష శయనావతారంలో స్వామివారు

భీమునిపట్నం: భీమిలిలో నిర్వహిస్తున్న జగన్నాథ స్వామి రథోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉదయం స్వామి వారు శేష శయనావతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ఆర్.కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆఖరు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మారు రథయాత్రలో పాల్గొన్నారు.